
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు

ఆదివారం 12 జనవరి 2025





విద్యుద్దీప కాంతుల్లో శ్రీశైల క్షేత్రం

శ్రీగిరిపై సంక్రాంతి శోభ





- మొదలైన బ్రహ్మోత్సవాలు
- 17వ తేదీతో ముగింపు

శ్రీశైలం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైలం మహా క్షేత్రంలో శనివారం సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. పంచాహ్నిక దీక్షతో నిర్వహించే ఈ ఉత్సవాలు ఈ నెల 17 తేదీ శుక్రవారంతో ముగియనున్నాయి. ఏడు రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు మొదటి రోజు ఉదయం 8.45 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభమయ్యాయి. లోక కల్యాణం కోసం నిర్వహించే బ్రహ్మోత్సవాలలో ప్రతి రోజూ జ్యోతిర్లింగస్వరూపుడైన మల్లికార్జునస్వామివారికి, మహాశక్తిస్వరూపిణి అయిన భ్రమరాంబికాదేవి అమ్మవారికి విశేషార్చనలు, ప్రత్యేక పూజలు, నవగ్రహ మండపారాధనలు, కలశార్చనలు, పారాయణాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు యాగశాల ప్రవేశం చేసి అనంతరం వేదపండితులు చతుర్వేద పారాయణాలతో వేదస్వస్తి నిర్వహించారు. ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను చేసి, శివ సంచార దేవతలలో ఒకరైన చండీశ్వరునికి పూజలు జరిపారు. తరువాత రుత్విగ్వరణం నిర్వహించి, అఖండ దీపస్థాపన, వాస్తుపూజ, వాస్తు హోమం చేశారు. సాయంకాలం అంకురార్పణ తర్వాత ఆలయ ప్రాంగణంలో నంది ధ్వజపటాన్ని ఆవిష్కరించారు. అనంతరం భేరీపూజ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. శ్రీశైలం దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమంలో సాయంత్రం హైదరాబాదుకు చెందిన అమృతాసింగ్ బృందం నృత్యప్రదర్శన అలరించింది.

నేడు స్వామి, అమ్మవార్లకు భృంగి వాహనసేవ: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు విశేషపూజలు, భృంగివాహన సేవ నిర్వహించనున్నారు.




యాగశాలలో ఉత్సవమూర్తులు



సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఈఓ, ఆలయ అర్చకులు





హెలీకాప్టర్ నుంచి పరిశీలిస్తున్న పవన్




పవర్ హౌస్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

అద్భుత నగరంగా కర్నూలు



- పర్యాటక కేంద్రంగా పిన్నాపురం
- రాష్ట్రానికి అవసరమైన సగం విద్యుత్ ఇక్కడే ఉత్పత్తి
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్
- గ్రీన్‌కో కంపెనీ నిర్మించిన ఐఆర్ఈపీ ప్రాజెక్టు పరిశీలన



కారు డ్రైవ్ చేస్తూ

కర్నూలు/పాణ్యం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 'నగరాలు అభివృద్ధి చెందాలంటే ఎనర్జీ (పవర్) ఎంతో ముఖ్యం. రాష్ట్రానికి అసరమైన విద్యుత్‌లో సగం ఇక్కడే ఉత్పత్తి అవుతుంది. భవిష్యత్తులో అద్భుతమైన నగరంగా కర్నూలు అభివృద్ధి చెందుతుంది' అని డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుమ్మటంతండా, నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం గ్రామాల మధ్య గ్రీన్‌కో గ్రూప్ 2,800 ఎకరాల్లో 5, 5,230 మెగావాట్ల యూనిట్లు విద్యుత్ సామర్థ్యంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు (ఐఆర్ఈపీ)ను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. ఆయన వెంట గ్రీన్‌కో గ్రూప్ సీఈఓ, ఎండీ చలమలశెట్టి అనిల్, కర్నూలు కలెక్టరు పి. రంజిత్‌బాషా ఉన్నారు. ఐఆర్ఈపీలో భాగంగా నిర్మించిన అప్పర్ ఇన్‌టెక్ పాయింట్, లోయర్ ఇన్‌టెక్ పాయింట్ సహా పవర్ హౌస్‌ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. విద్యుత్ ఉత్పత్తిపై కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా కారు నడుపుతూ టన్నెల్ పరిశీలించారు. అనంతరం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కర్నూలు, నంద్యాల కలెక్టర్లు పి. రంజిత్‌బాషా, రాజకుమారి, గ్రీన్‌కో గ్రూప్ సీఈవో, ఎండీ చలమలశెట్టి అనిల్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు దూరదృష్టికి పిన్నాపురం ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టే నిదర్శనమన్నారు. రాష్ట్ర విభజన తరువాత రాళ్ల సీమగా ఉన్న రాయలసీమను రత్నాలు సీమగా మార్చాలనే సంకల్పంతో ఆసియాలోనే తొలి వెయ్యి మెగావాట్లా సోలార్ ప్లాంట్ ఇక్కడే నిర్మించారు. సేద్యానికి పనికిరాని రాళ్ల భూమిలో ఒకే ప్రాంతంలో సోలార్, విండ్, హైడ్రో పవర్ జనరేషన్ చేసేలా ఐఆర్ఈపీ నిర్మాణానికి ఆనాడే శ్రీకారం చుట్టారు. ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా భవిష్యత్తులో విదేశాలకు విద్యుత్ అమ్ముకునే స్థాయికి ఎదుగుతామన్నారు. ఈ ప్రాంతం భవిష్యత్‌లో సైట్ సీయింగ్ పర్యాటక క్షేత్రంగా, ఎడ్యుకేషనల్ ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటుందని వివరించారు. ఆఫీసుల్లో కూర్చొని రివ్యూలు చేస్తే ఇలాంటి అద్భుత విషయాలు తెలియవన్నారు. అందుకే క్షేత్రస్థాయిలో చూడాలన్న ఉద్దేశంతో ఇక్కడికి వచ్చానని పేర్కొన్నారు.





మిగతా 7వ పేజీలో



ఐఆర్ఈపీలోని పంప్డ్ స్టోరేజ్‌ను పరిశీలిస్తూ...



గ్రీన్‌కో ప్రతినిధులతో మంత్రులు పవన్ కళ్యాణ్, బీసీ, కలెక్టర్లు

మహానందిలో సంక్రాంతి ఉత్సవాలు : ఈఓ

మహానంది, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో మకర సంక్రాంతి పర్వదిన ఉత్సవాలను మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో వేదపండితులు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈ ఏడాది మహానంది ఆలయంలో మకర సంక్రాంతి వేడుకలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 13న బోగి పర్వదినం రోజు చిన్నారులకు బోగి పండ్ల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న మకర సంక్రాంతి రోజు గంగిరెద్దులకు పూజలు చేసి హరిదాసు కీర్తనలు జరుగుతాయన్నారు. 15న గోశాలలో పశువులకు ప్రత్యేక పూజలు, సాయంత్రం పారువేట ఉత్సవం, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

నంద్యాల కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆంగ్లేయుల పాలిట సింహస్వప్నంగా నిలిచిన రేనాటి వీరుడు వడ్డే ఓబన్న జయంతిని జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. నంద్యాల బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో అధికారికంగా జయంతిని నిర్వహించారు. ముందుగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర కమ్యూనిటీ కౌన్సిల్‌ఆఫ్ ఇండియా నంద్యాల జిల్లా అధ్యక్షుడు చక్రధర్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆంగ్లేయులతో జరిగిన వీరోచిత పోరాటంలో దేశం కోసం వడ్డె ఓబన్న ప్రాణత్యాగం చేశారన్నారు. అంతటి మహోన్నత వ్యక్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారులు ముస్తాక్ అహ్మద్, సురేష్, అసిస్టెంట్ డీఎంహెచ్‌వో శారద, డీఎల్‌డీఓ శివారెడ్డి, బీసీ వెల్ఫేర్ సూపరింటెండెంట్ గోవర్ధన్, వడ్డెర సంఘం నాయకులు సుబ్బరాయుడు, వడ్డే శ్రీను, వెంకటేష్, రామాంజనేయులు, గోపాల్, మధు, నాగరాజు, పుల్లయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న అధికారులు, వడ్డె సంఘం నాయకులు

తుంగభద్ర తీరం

సాహిత్యం



ఆరుసారా కథలు

ఆరుసారా కథలు తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప సంచలనం. ఈ సారా కథల్లో ఆనాటి ప్రభుత్వ యంత్రాంగాన్ని రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి ఎండగట్టారు. అయితే ప్రభుత్వం అసలు పని సొంత ఆస్తికి పోలీసు కాపలా కాయడమేనని 70 ఏళ్ల కిందటి మాట నేటికీ అక్షరసత్యం. రావిశాస్త్రి ఎప్పుడూ జనంలో, జనంతోనే ఉంటారు. వాళ్లతో నిత్యం సంభాషిస్తూనే ఉంటారు. ఆయన రచన వ్యాసంగానికి ఇది ఆయువుపట్టు. నీటిలో చేపలా ఎప్పుడూ సామాన్యులతోనే మెలిగేవారు ఆయన. బహుశా న్యాయవాదిగా కూడా ఆయనకు అనుభవం ఉండొచ్చు. రావిశాస్త్రి కథల్లో అతనే కనిపిస్తారని ఒక విమర్శ కూడా ఉంది. భ్రష్టుపట్టిన కొందరు పోలీసు వాళ్లు ఏమార్గంలోనైనా డబ్బు సంపాదించాలనే న్యాయవాదులు ఇంకా లిక్కర్ మాఫియా వాళ్లు.. వీళ్లందరి కుంభకోణంలో చితికిపడే బీదలు. ఆరుసార కథలోని పాత్రలు చాలా సంక్లిష్టమైన మానసికతను ప్రదర్శిస్తాయి. ఈ రచనలో ఉత్తరాంధ్ర మాండలికాన్ని అద్భుతంగా చూపారు. రావిశాస్త్రి ఈ కథలో పెద్దవాళ్లకంటే కష్టజీవులే తెలివైన వాళ్లు అని చెప్పినట్టుగా కూడా కనిపిస్తుంది. ఆరుసారా కథల్లో మొదటి కథ పాపిలో ఆ ఊరి డాన్‌ను కూడా సానుభూతితో చూపిస్తాడు. మంచోళ్లకే కాదు రౌడీలకు కూడా నీతి ఉండాలని చెప్పే విధంగా మలిచారు పాత్రను. రెండవ కథ మాయలో కొత్తగా పట్టభద్రుడైన న్యాయవాదికి ముద్దాయి ముత్యాలమ్మ కళ్లు బైర్లు కమ్మేవిధంగా జ్ఞానబోధ చేస్తుంది. పెద్ద ప్లీడర్లు, చిన్న ప్లీడర్లకు 'సత్యం, ధర్మం, న్యాయం మాటలు కాదు అదంతా కూడా మాయేనని.' చెప్పడం. 'పని కూలీ వాళ్లది లాభం యజమానులది' 'ఆకులు ప్రజలవి యాపిల్ పండ్లు అధికారులవి' వంటి మాటలు రక్తి కట్టిస్తాయి.

మరొక కథ న్యాయంలో వేశ్యల బతుకులను కళ్లకు కట్టేలా చూపించారు. 'అందరూ ఉంటే మీ కడుపున పుట్టిన ఆడకూతుర్లలాగానే నేనూ బతుకుదును, ఈ కుక్క బతుకు నాకెందుకు' లాంటి మాటలు మనిషిని ఆలోచనలో పడేస్తాయి. 'మోసం' కథలో కిందిస్థాయి పోలీసులు పడే బాధలను హెడ్ కానిస్టేబుల్ పాత్ర చేత చక్కగా చెప్పించారు. గవర్నమెంట్ అంటే ఓట్లు, ఓట్లు అంటే నోట్లు అనే సారాయి అమ్మే పాత్ర ద్వారా చక్కగా చెప్పించారు. మరొక కథ 'పుణ్యం'లో కోర్టులకు వచ్చి నలిగిపోయే బీద జనాల గురించి క్లైంట్ల కోసం కొట్టుకునే లాయర్ల వ్యక్తిత్వాన్ని చక్కగా చెప్పారు. ఈ కథలో 'మంచి, చెడు, పాపం, పుణ్యం లేవని లాభం, నష్టం రెండే ఉన్నాయని చెప్పారు. చివరి కథ 'మోక్షం'లో అభాగ్యులను నిరుపేదలను జైళ్లకు పంపే మెజిస్ట్రేట్ గారికి పిచ్చెక్కి ఆసుపత్రికి పోతూ 'గవర్నమెంట్‌కి పాపం పిచ్చెక్కినట్టుంది ఎలా ఉందో చూద్దాం పదండి' అని చివర్లో ముగించి ఆసక్తి కలిగించారు. ఈ కథల్లో పాఠకుడిని కాలర్ పట్టుకుని నిలిపేసే లక్షణం ఉంది. ఇవి చదివాక, చదవక ముందున్న స్థితిలో పాఠకుడు ఉండడు.

- ఎం.వెంకటేష్, ఆదోని

హేమంతపు చేమంతి



హేమంతం
కరుగుతుంటే
చేమంతి విరబూస్తుంది

హేమంతం
చేమంతికి ప్రియనేస్తం
యేటేటా
కలిసేవస్తారు



హేమంతం తొడిగితే
రవి కిరణాలు
మెరుగులు దిద్దాయి

మురిపించే చేబంతి
మైమరపించే హేమంతి
వెరసి సంతోషాల
సంబరాల సంక్రాంతి

చల్లని గాలులు
నులివెచ్చని
సంక్రాంతి ఎండలు
వింతవింత అనుభూతులు

పచ్చికపై మంచు ముత్యాల్ని

-సంగిపోగు ఆనంద్‌రాజు, ఆదోని

హరికిషన్‌కు చిన్న బుచ్చినాయుడు స్మారక పురస్కారం



ఎం. హరికిషన్


కర్నూలు కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ బాల సాహితీవేత్త, 80కి పైగా పుస్తకాలు ప్రచురించిన డాక్టర్ ఎం. హరికిషన్‌కు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 'చిన్న బుచ్చినాయుడు' స్మారక పురస్కారం శనివారం ప్రకటించింది. ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి కె. పుష్ప పురస్కార ప్రదానోత్సవ వివరాలు తెలిపారు. ఈనెల 18న ఉదయం 10 గంటలకు చిత్తూరు జిల్లా పలమనేరులోని కళామందిరంలో ఏర్పాటు చేసిన సాహితీ కార్యక్రమంలో ఈ పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు. సాహితీ రంగంలో డాక్టర్ ఎం. హరికిషన్ అందిస్తున్న విశేష సేవలను గుర్తించి పలమనేరుకు చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు తన తండ్రి స్మారకార్థం నెలకొల్పిన 'చిన్న బుచ్చినాయుడు' స్మారక పురస్కారాన్ని తిరుపతి జిల్లా రచయిత సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, ప్రముఖ శతావధాని ఆముదాల మురళి చేతుల మీదుగా హరికిషన్‌కు అందజేయనున్నారు.



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

నగరంలో నేడు



- నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న కళాసౌరభవం జాతీయ స్థాయి నృత్యపోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి.
- నగరంలోని సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో ఉదయం 11 గంటలకు ఆలయంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలపై నగర బ్రాహ్మణ సంఘం సమావేశం ఉంటుంది.
- నగర శివారులో మామిదాలపాడులోని గోదా గోకుల క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ఉదయం 8 గంటలకు ప్రవచన బోధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.
- నగర శివారు గుత్తిరోడ్డులోని ఇండస్ స్కూల్‌లో టీజీవీ ఫైన్ ఆర్ట్స్ సంస్థ వారి సౌత్ ఏషియన్ పీస్ కాన్ఫరెన్స్ సదస్సు ముగింపు వేడుకలను నిర్వహిస్తున్నారు.
- నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సాయంత్రం 6.30 గంటలకు జాతీయ స్థాయి నృత్యపోటీల విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుంది.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ ఉమా శనివారం రాత్రి దర్శించుకున్నారు. ముఖ ద్వారం వద్ద మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు.

రంగుల మార్కెట్



సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు వాకిళ్లన్నీ ముగ్గులతో కళకళలాడుతుంటాయి. రంగురంగుల ముగ్గులు.. ఒక్కో రోజు ఒక్కో తీరుగా ఇళ్ల ముందు ముగ్గులు వేయడానికి మహిళలు ఉత్సాహంగా ముందుకొస్తారు. ఏ ఇంటికి వెళ్లినా ముందు కనిపించేవి రంగు రంగుల ముగ్గులు. సోషల్ మీడియా విస్తృతం కావడంతో ముగ్గులపై మహిళలకు క్రేజ్ మరింతగా పెరిగింది. ఫలితంగా మార్కెట్లలో ముగ్గులు వేసేందుకు అవసరమైన రంగుపొడుల విక్రయాలు పెరిగాయి. వారం రోజులుగా ముగ్గులకు వినియోగించే రంగులకు మంచి డిమాండ్ ఏర్పడింది. నగరంలోని ప్రధాన కూడళ్లలో వ్యాపారులు రంగులను విక్రయిస్తున్నారు. ముగ్గుపిండితో పాటు రంగుల ధరలు ధర కిలో రూ.70-80 చొప్పున విక్రయిస్తున్నారు. ఓ మోస్తరు ముగ్గు వేసి రంగులు నింపాలంటే కనీసం రూ.150 దాకా వెచ్చించాల్సి వస్తోంది. అయినప్పటికీ మహిళలు ఖర్చులకు వెనుకాడకుండా పోటీపడి మరి కొనుగోలు చేస్తుండటం విశేషం.

-కర్నూలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)



విక్రయానికి సిద్ధంగా ఉన్న రంగులు



కొండారెడ్డి బురుజు వద్ద కొనుగోలు చేస్తున్న మహిళలు

కళాకారుల పుట్టినిల్లు కర్నూలు



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కళలు, కళాకారులకు పుట్టినిల్లు కందనవోలు అని కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య అన్నారు. కర్నూలులోని నటరాజ నృత్య కళామందిర్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు రెండోరోజు శనివారం కార్యక్రమాలను పత్తి ఓబులయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ కళలకు ప్రాణం పోస్తూనే సంప్రదాయ జానపద నృత్యాలకు ఆదరణ కల్పిస్తూ నటరాజ నృత్య కళామందిర్ సంస్థ గత పదేళ్లుగా కృషి చేస్తోందని అన్నారు. వందలాది ఔత్సాహికులు ఇక్కడ నృత్య శిక్షణలు పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, ఆ దిశగా నాట్యాచార్యుడు కరీముల్లా కృషి అభినందనీయమని చెప్పారు. నాట్యాచార్యుడు కరీముల్లా మాట్లాడుతూ కళా సౌరభ పేరుతో నిర్వహిస్తున్న ఈ పోటీలకు స్థానిక కళాకారులతోపాటూ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారులు ఇస్తున్న సహకారం మర్చిపోలేనిదని అన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నాట్యం...అలరించిన జానపద నృత్యాలు

జాతీయ స్థాయి నృత్య పోటీలలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలతోపాటూ సోలో, గ్రూప్ విభాగాలలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 70 మందికి పైగా కళాకారులు తమ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కూచిపూడి, భరతనాట్యంతో పాటు జానపద నృత్యాలతో ప్రేక్షకులను అలరింపజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నాట్యాచార్యులు ఎ. సంతోష్, జక్కా శ్రీకృష్ణ వ్యవహరించారు. నటరాజ నృత్య కళామందిర్ కార్యవర్గ కమిటీ ప్రతినిధులు డాక్టర్ బీవీ స్వరూప్ సిన్హా, కేపీఆర్ శర్మ సహకారం అందించారు.

ముగిసిన జాతీయ జూనియర్ రోల్‌బాల్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రిడ్జ్ పాఠశాలలో జరుగుతున్న జాతీయ జూనియర్ రోల్‌బాల్ పోటీలు శనివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ హాజరై మాట్లాడారు. క్రీడాకారులు క్రీడలతోపాటు చదువులో రాణించాలన్నారు. పాఠశాల వ్యవస్థాప కుడు జి.పుల్లయ్య మాట్లాడు తూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, సీఈవో గోపినాథ్, రవీంద్ర గ్లోబల్ పాఠశాల సీఈవో జి.వంశీధర్, రోల్‌బాల్ ప్రెసిడెంటు జి.చంద్రమౌళి, కార్యదర్శి అనిల్ కుమార్ రెడ్డి, కన్వీనర్ సునీల్ కుమార్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం నేషనల్ జూనియర్ రోల్‌బాల్ బాలుర ఫైనల్ విజేతలుగా రాజస్థాన్ (ప్రథమ స్థానం), తమిళనాడు (ద్వితీయ స్థానం), గుజరాత్ (తృతీయ స్థానం) సాధించారు. బాలికల విభాగంలో అస్సాం (ప్రథమ స్థానం), రాజస్థాన్ (ద్వితీయ స్థానం), మహారాష్ట్ర (తృతీయ స్థానం) సాధించారు. వీరికి టీజీ వెంక టేశ్, గౌరవ అతిథులు ట్రోఫీలను అందజేశారు.



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న టీజీ వెంకటేశ్

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు

శ్రీశైలం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లి కార్జున స్వామి, అమ్మవార్లను శనివారం మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సెక్రటరీ చంద్రశేఖర్ దర్శించుకున్నారు. స్వామి, అమ్మ వార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న చంద్ర శేఖర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం చంద్రశేఖర్ స్వామి వారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవి అమ్మవారికి ప్రత్యే అర్చనలు జరిపించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో చంద్రశేఖర్‌కు వేదపండితులు వేదా శీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. తరువాత ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాస రావు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.



మంత్రిత్వశాఖ సెక్రటరీ చంద్రశేఖర్‌కు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈవో

అ'పూర్వ' కలయిక

25 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి11 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 1995-2000 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒకే చోట కలుసుకున్నారు. తోటి స్నేహితులను చూసి ఒకరికొకరు ఆలింగనం చేసుకొని , తరగతి గదులలో చేసిన అల్లర్లను జ్ఞాపకం చేసుకొని సంతోషంతో ఉప్పొంగిపోయారు. సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆటపాటలతో గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి, పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున, రిటైర్డ్ హెచ్‌ఎం విజయ కుమారి, రిటైర్డ్ ఉపాధ్యాయులు సిద్ధప్ప మోహన్ రావు, హనుమంతు, ఫిజికల్ డైరెక్టర్ నరసయ్య సీనియర్ ఉపాధ్యాయుడు ఫయాజుద్దీన్, పూర్వవిద్యార్థుల ఆర్గనైజరులు బసవరాజు, ఈరన్న, గౌతమ్, భగవాన్ సింగ్, గౌరీ, రమణ, కన్యాకుమారి పాల్గొన్నారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

అహోబిలంలో గోదాదేవికి విశేష పూజలు



ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 11(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ద్వాదశి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా కూడారై వెల్లుమ్మీర్ గోవింద పాశురం వేడుకలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వామి, గోదాదేవి అమ్మవారికి వేకువజామునే విశేష పూజలు నిర్వహించారు. వెండి పాత్రల్లో అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ట్రాన్స్‌కో డైరెక్టర్ ప్రత్యేక పూజలు

ట్రాన్స్‌కో రాష్ట్ర డైరెక్టర్ ఏకేవీ భాస్కర్ కుటుంబ సభ్యులతో కలిసి దిగువ అహోబిలంలోని లక్ష్మీనృసింహ స్వామిని శనివారం దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలోని లక్ష్మీనృసింహ స్వామిని, అమృతవల్లి, గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాలను అందజేశారు.



భాస్కర్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

కనుల పండువగా 'శ్రీరాములోరి శోభాయాత్ర'

వేలాదిగా తరలివచ్చిన భక్తులు



లలితాపీఠం వద్ద శోభాయాత్రను ప్రారంభిస్తున్న సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నగరంలోని సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన 'శ్రీరాముల వారి శోభాయాత్ర' కనుల పండుగా నిర్వహించారు. సమితి నాయకులతో పాటూ, వివిధ ఆలయాల ధర్మకర్తలు, ధార్మిక సంస్థ ప్రతినిధులు, భక్తులు వేలాదిగా తరలివచ్చి శోభాయాత్రలో పాల్గొన్నారు. పాత నగరంలోని జమ్మిచెట్టు సమీపంలోగల లలితాపీఠం నుంచీ ఈ శోభాయాత్ర ఆరంభమైంది. రాముల వారి భారీ విగ్రహాన్ని వాహనంపై అధిష్టింపజేసి, పుష్పహారాలు, కాషాయ పతాకాలతో అలంకరింపజేసి శాస్త్రోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు లలితా పీఠంలో లక్ష రామనామ జపం పారాయణం చేశారు. లలితాపీఠం పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎం. మోక్షేశ్వరుడు, అధ్యక్షుడు కె. క్రిష్ణన్న, ఉపాధ్యక్షులు ఎస్‌జీ మహాబలేష్, చల్లా దామోదర్‌రెడ్డి, నాగోజీరావు, నాయకులు నటేష్, ఎస్వీ నారాయణరెడ్డి, అచ్చి నరసింగరావు, లక్ష్మయ్య, రామచంద్రశ్యామ్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు. యాత్రలో వివిధ ధార్మిక సంస్థలు, ఆలయాల కమిటీల నిర్వాహకులు, మహిళా భక్తులు సంప్రదాయంగా కాషాయ కండువాలతో ర్యాలీలో పాల్గొన్నారు. మహిళలు, పిల్లల కోలాట నృత్యాలు, భజనలు ఆకట్టుకున్నాయి. కాషాయ పతాకాలు ధరించిన యువత శోభాయాత్రలో సందడి చేశారు. పాతనగరంలోని వన్‌టౌన్, పూలబజార్, గడియారం ఆసుపత్రి, పెద్దమార్కెట్, కొండారెడ్డి బురుజు, రాజ్‌విహార్ మీదుగా రాజ్‌విహార్ బస్టాప్ పక్కన గల రేణుకా ఎల్లమ్మ ఆలయం జై శ్రీరామ్ అనే నినాదాలతో శోభాయాత్ర కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



శోభాయాత్రకు స్వాగతం పలుకుతున్న స్వామీజీలు, మహిళా భక్తులు

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత






కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న జి.శ్రీలక్ష్మీ (కర్నూలు), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి



పవన్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

అద్భుత నగరంగా కర్నూలు

5వ పేజీ తరువాయి



పవన్‌కు స్వాగతం పలుకుతున్న కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా

ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఓర్వకల్లు విమానాశ్రయంలో ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకున్న పవన్‌కళ్యాణ్‌కు జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు, కోడుమూరు ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, కర్నూలు ఎస్పీ బిందుమాధవ్, ఎయిర్‌పోర్టు డైరెక్టరు విద్యాసాగర్, డీఎస్పీ వెంకట రామయ్య తదితరులు ఘనస్వాగం కలికారు. సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు నుంచి గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. నంద్యాల ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా, జడ్పీ సీఈవో నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల్లో నిరుత్సాహం

ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన ముఖ్య నాయకుల్లో ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పర్యటన నిరుత్సాహం నింపింది. షెడ్యూల్ ప్రకారం అర గంట పాటు జనసేన నాయకులతో పవన్‌కళ్యాణ్ సమీక్షించాల్సి ఉంది. పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి చింతా సురేశ్, ఆదోని, ఎమ్మిగనూరు, మల్లప్ప, రేఖాగౌడ్, తెర్నేకల్లు యంకప్పతో పాటు కర్నూలు, శ్రీశైలం, డోన్, పత్తికొండ, నందికొట్కూరు, ఆత్మకూరు, కోడుమూరు నియోజకవర్గాల బాధ్యులు అర్షద్, అశోక్, బ్రహ్మ, రాజశేఖర్, మల్లయ్య, నల్లమల రవి, రాంబాబు, సురేశ్, ఏపీ వాల్మీకి/ బోయ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మంజూనాథ్‌లు గ్రీన్‌కో కంపెనీ గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. జనసేన నాయకులతో బ్లాక్-8లో సమావేశం ఏర్పాటు చేశారు. వారితో అరగంట సమావేశమై పార్టీ బలోపేతం, నామినేటెడ్ పోస్టులు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించాల్సి ఉంది. పర్యటన ఆలస్యం కావ డంతో సమావేశం నిర్వహించకుండానే పవన్ కళ్యాణ్ వెళ్లిపోయారు. దీంతో జనసేన నాయకులు కొంత నిరుత్సాహం చెందారు. తమవద్దకే వచ్చిన అధినేతను కలుసుకోలేకపోయామని ఓ నాయకుడు పేర్కొనడం కొసమెరుపు.

ఓర్వకల్లు సిగలో మరో పరిశ్రమ

- రూ.14 వేల కోట్లతో ఇండిచిప్ సెమికండక్టర్ పరిశ్రమ
- చిప్ తయారీ దేశంలోనే తొలి పరిశ్రమ ఇది
- రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ సమక్షంలో ఎంఓయూ



మంత్రులు లోకేశ్, టీజీ భరత్ సమక్షంలో ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

కర్నూలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో మరో ప్రతిష్ఠాత్మక పరిశ్రమ చేరింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కష్టం ఫలించింది. భారతదేశంలోనే ప్రప్రథమ చిప్ తయారి సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు కీలకమైన అడుగులు శనివారం పడ్డాయి. చిప్ తయారీ రంగంలో దేశాన్ని గ్లోబల్ లీడరుగా మార్చే పరిశ్రమను ఇండిచిప్ సెమీకండక్టర్స్ లిమిటెడ్ సంస్థ తన భాగస్వామ్య సంస్థ అయిన జపాన్‌కు చెందిన ఎంఎస్‌యితో మైక్రో టెక్నాలజీ కంపెనీ (మైఎంటీఎల్)తో కలసి ఏపీలో స్థాపించనున్నారు. ఓర్వకల్లు కేంద్రంగా రూ.14 వేల కోట్లకు పైగా పెట్టుబడితో ప్రైవేట్ రంగంలో సెమికండక్టర్ పరిశ్రమ స్థాపించేందుకు రాష్ట్ర మానవవనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సమక్షంలో ఇండిచిప్ మేనేజింగ్ డైరెక్టర్ పీయూష్ బిచ్చేరియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన ఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మలు అవగాహన ఒప్పంద (ఎంఓయూ) కుదుర్చుకున్నారు. ఈ మేరకు అమరావతిలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి.. ఆ పత్రాలను ఒకరిఒకరు మార్చుకున్నారు. ఇప్పటికే ఓర్వకల్లు పారిశ్రామికవాడలో సెమికండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు భాగస్వామ్య సంస్థలు పరిశీలించాయి. పరిశ్రమకు ఏర్పాటు అవసరమైన దాదాపు 250 ఎకరాలకు పైగా భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం కూడా ఆమోదించింది.

గత డిసెంబరులో ఓర్వకల్లుకు సెమికండక్టర్ పరిశ్రమ రాబోతుందని, రూ.14 వేల కోట్లకుపైగా పెట్టుబడితో ఈ పరిశ్రమ రాబోతుందని, దేశంలోనే మొట్టమొదటి పరిశ్రమను ఏపీకి తీసుకురావడం, అందులోనూ ఓర్వకల్లులో ఏర్పాటు చేసేలా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఎంతో చొరవ తీసుకున్నారని మంత్రి టీజీ భరత్ వెల్లడించిన సంగతి తెలిసిందే. జనవరి తొలివారంలో కంపెనీ, ప్రభుత్వ ప్రతినిధులు అవగాహన ఒప్పందం చేసుకొని సంబంధిత పత్రాలపై సంకాలు చేస్తారని కూడా వెల్లడించారు. 2024 నవంబరులో ప్రకటించిన సెమీకండక్టర్ పాలసీ ద్వారా చంద్రబాబు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ తయారీ హబ్‌గా మారుస్తుందని టీజీ భరత్ వివరించారు. సరికొత్త ఎస్‌ఐసీ ఫ్యాబ్ సైకర్యం ప్రారంభంలో నెలకు 10,000 వాఫర్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభం అవుతుంది. రెండుమూడేళ్లలో 50,000 వాఫర్స్ ఉత్పత్తి చేరుకుంటుంది. ఆత్మ నిర్భర్ భారత్ దృష్టితో అనుసంధానమై, విద్యుత్ వాహనాలు, నూతన ఇంధన పరికరాలు, పునరుత్పత్తి శక్తి ద్వారా పెరుగుతున్న గ్లోబల్ డిమాండ్ తీర్చేందుకు దోహదం పడుతుందని అంటున్నారు.

యువతకు ఉద్యోగాలే లక్ష్యం

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్ యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా రాష్ట్రానికి వివిధ పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ఎంతో కష్టపడుతున్నారు. పరిశ్రమల శాఖ మంత్రిగా ఆ కష్టంలో నేను పాలుపంచుకోవడం ఆనందంగా ఉంది. సెమీకండక్టర్ పరిశ్రమ ఓర్వకల్లు హబ్‌కు రావడంతో వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. యువతకు ఉద్యోగాలు కల్పించవచ్చు. దేశంలో వేరే రాష్ట్రానికి వెళ్లే ఈ పరిశ్రమను ఐటీ మంత్రి నారా లోకేశ్ మన రాష్ట్రానికి తీసుకొచ్చారు. లోకేశ్‌ను ఒప్పించి ఆ పరిశ్రమను మన జిల్లాకు తీసుకొచ్చాను. భారతదేశాన్నే చిప్ తయారీలో గ్లోబల్ లీడర్‌గా మార్చే ఈ పరిశ్రమ జిల్లాకు తీసుకురావడంతో జన్మభూమి రుణం కొంతైనా తీర్చుకున్నాను అనే ఆనందం కలిగింది.

- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా చిరంజీవి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా జిల్లాలోని మూడు కీలక స్థానాల్లో నూతన అధికారులు నియమితులు కానున్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జీవో నెంబరు 66 ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జాతీయ రహదారుల సంస్థ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, గృహనిర్మాణ సంస్థ పీడీగా పనిచేస్తున్న టి.చిరంజీవిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన అభివృద్ధి (ఏపీఐఐసీ) సంస్థ జోనల్ మేనేజర్‌గా నియమించారు. ఆయన స్థానంలో ఆర్.వి.సునీతా భాయిని ఎన్‌హెచ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఇదే క్రమంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కడప జిల్లా నుంచి కె.అనురాధను బదిలీ చేశారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా గత నెల ఒంగోలు నుంచి బదిలీపై వచ్చిన మధుసూదన్‌రెడ్డికి పోస్టింగ్‌పై ఇంకా స్పష్టత రాలేదు.



అంధుల ఆశాజ్యోతి లూయి బ్రెయిలీ

- 31 మంది సభ్యుల రక్తదానం



సభ్యులను అభినందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు

కర్నూలు హాస్పిటల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అంధుల ఆశాజ్యోతి లూయి బ్రెయిలీ అని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ మహేంద్ర కుమార్ అన్నారు. లూయి బ్రెయిలీ 216 జయంతి వేడుకలను పురస్కరించుకుని జాతీయ అంధుల సమాఖ్య (ఎన్ఎఫ్‌బీ) ఆధ్వర్యంలో నగరంలోని బీ.క్యాం పులో 31 మంది సభ్యులు స్వచ్ఛంద రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అంధుల సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.పుష్పరాజ్, బి.అనిల్ కుమార్ మాట్లాడుతూ లూయి బ్రెయిలీ కేవలం అంధులకే గాక ఇతరులకు కూడా స్ఫూర్తిదాతగా నిలిచారనీ కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎ ఫ్‌బీ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, మహేశ్వరరెడ్డి, జాతీయ మాజీ కార్యదర్శి విశ్వనాథరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి వెంకట కృష్ణుడు, మాజీ చైర్మన్ గార్గేయాపురం శ్రీనివాసులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేదికపై పూర్వ విద్యార్థులు

వెలుగోడు జనవరి 11(ఆంధ్రజ్యోతి): వెలుగోడులోని జడ్పీ హైస్కూల్ 1997-98 సంవత్సరానికి చెందిన పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం పాఠశాలలో కలిశారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంఘం నాయకులు జయరామిరెడ్డి, సుల్తాన్ మొహిద్దీన్, శ్రీనివాసులు, శ్రీరాములు, నారాయణ, ఆర్గనైజర్లు గోవర్ధన్‌రెడ్డి, హేమంత్ కుమార్, జాకీర్, మదన్, రవినాయక్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నంద్యాల కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల గుడిపాటి గడ్డలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీ ఆదాయాన్ని శనివారం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో ఈవో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.2,90,869 ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది రూ.12,823 ఎక్కువగా వచ్చిందని ఈవో తెలిపారు. అర్చకులు ప్రహ్లాదవరద, శ్రీనివాసులు, శ్రీదేవి, మురళి, శ్రీనివాసులు, బాలాజీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పార్చన



పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నంద్యాల కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల బాలాజీ కాంప్లెక్స్ కళ్యాణ మండపంలోని వేంకటేశ్వరాలయంలో శనివారం ద్వాదశి సందదర్భంగా స్వామికి 15 రకాల పుష్పాలతో వైభవంగా పుష్పార్చన నిర్వహించారు. అర్చకులు నిఖిలేష్‌శర్మ, రుషి కుమార్, శ్రీనివాస్, కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్య దర్శి నారాయణ శ్రీనివాస్, సురేష్‌బాబు, చంద్రశేఖర్, మహిళామండలి సభ్యులు వాసవి, భారతి, గీతాలక్ష్మి, భారతి పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. స్వామి, అమ్మవార్ల తరపున కుందూరు శివారెడ్డి దంపతులు హాజరయ్యారు. అలాగే ధనుర్మాస పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉపముఖ్యమంత్రికి ఎస్పీ స్వాగతం

నంద్యాల క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ శనివారం పర్యటించారు. పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలోని గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్‌ను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద ఉపముఖ్యమంత్రిని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.



పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న అధిరాజ్ సింగ్ రాణా

డిప్యూటీ సీఎం దృష్టికి సమస్యలు

పాణ్యం, జనవరి11 (ఆంధ్రజ్యోతి): కందికాయపల్లిలో సోలార్ ఏర్పాటులో భాగంగా వేసిన కంచెలతో పాడి పశువులు మేతకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని విలేకరులు పిన్నాపురం వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి సమస్యలు వివరించారు. డిప్యూటీ సీఎం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమస్యల గురించి చెప్పారు. సోలార్ కోసం వేసిన కంచెలు కొండకు వెళ్లే పశువుల మార్గాన్ని మూసివేశాయన్నారు. అలాగే పిన్నాపురంలో స్థానికులకు 50 శాతం ఉద్యోగ కల్పన చేపడతామన్న గ్రీన్‌కో హామీ నెరవేర్చలేదని చెప్పారు. దీనికి గ్రీన్‌కో నిర్వాహకులు సమాధానమిస్తూ ఇప్పటికే దాదాపు 40 మంది కి ఉద్యోగ అవకాశాలు కల్పించామని సమాధానమిచ్చారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఎద్దుల బండిని పైకి లాగుతున్న రైతు, స్థానికులు

బండిఆత్మకూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరులోని కుందూ నది వంతెనపై ప్రమాదం త్రుటిలో తప్పింది. శనివారం తెల్లారే సమయంలో పొలం పనులకు గ్రామానికి చెందిన గంగాధర్ అనే రైతు ఎద్దుల బండిపై బయలుదేరారు. అయితే కుందూ నది వంతెనపై వెళ్తున్న సమయంలో వాహనాల శబ్దానికి ఎద్దులు బెదిరాయి. దీంతో బండి కుందూనదిలో పడబోగా రైతు చాకచక్యంగా ఎద్దులను వంతెన వైపునకు మళ్లించారు. సగం బండి వంతెనపై నుంచి నదిలోకి వేలాడుతుండగా అటుగా వెళ్తున్న గ్రామస్థులు రైతును, ఎద్దులను రక్షించారు. నది వంతెనకు ఇరువైపులా ఎలాంటి రక్షణ గోడ, వలయం లేకపోవటంతో ఇటీవలనే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో వంతెనపై నుంచి నదిలో పడ్డాడు. ఆ సమయంలో నదీ ప్రవాహం తక్కువగా ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాడు. నది వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



ఆత్మకూరులో చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



తరిగోపులలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అఖిల భారత వడ్డే ఓబన్న సేవా సమితి కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని నిర్వహించారు. సమితి నాయకులు నాగరాజు, అంజనేయులు, వెంకటేశ్వర్లు, కృష్ణ, దరగయ్య, మల్లికార్జున, చంద్రగిరి దుర్గరాజు, పెద్దరాజు, శివ, హరికృష్ణ, సుబ్బరాజు, మద్దిలేటి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

మహానంది(ఆంధ్రజ్యోతి): మహానందిలోని వడ్డే వడియరాజుల సత్రంలో నిర్వాహకులు తిరుపతి వెంకటేశ్వర్లు, పల్లపు శేషగిరి రావు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రకాశం జిల్లా గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు హాజరై మాట్లాడారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రథమంగా పోరాటం చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నిత్యం వెన్నంటి ఉంటూ సైన్యాధ్యక్షుడిగా బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించారని వడ్డే ఓబన్న వీర ప్రతాపాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో అందరూ కలిసి విజయవంతం చేయడం అభినందనీయమని అన్నారు.



మహానందిలో మాట్లాడుతున్న గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు

జూపాడుబంగ్లా(ఆంధ్రజ్యోతి): తరిగోపుల గ్రామంలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. మిఠాయిలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, గిరీశ్వర రెడ్డి, మహేశ్వరరెడ్డి, యుగంధర్‌రెడ్డి, వడ్డెరసంఘం నాయకులు వెంకటేశ్వర్లు, సుంకన్న, పాపారాయుడు, బీసన్న, శేఖర్, రంగస్వామి, ధర్మరాజు పాల్గొన్నారు.

గోకులం షెడ్లతో రైతులకు ప్రయోజనం: ఎమ్మెల్యే



బొల్లవరంలో షెడ్డులోకి గోవును తీసుకొస్తున్న ఎమ్మెల్యే



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న తులసిరెడ్డి

నందికొట్కూరు రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రైతుల, పశువుల అభివృద్ధికోసం చేపట్టిన గోకులం షెడ్లతో నిర్మాణాల వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం ఉందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. నందికొట్కూరు మండలంలోని మల్యాల, బొల్లవరం గ్రామాల్లో గోకులం షెడ్లను శనివారం ప్రాంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం, పాడి పశువుల అభివృద్ధి కోసం రాయితీ కింద గోకులం షెడ్లను, పశుగ్రాసాన్ని కూడా అందిస్తోందని తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీడీ అన్వరాబేగం, ఎంపీడీవో సుబ్రమణ్యశర్మ, ఎస్ఐ తిరుపాలు, మాండ్ర సురేంద్రనాథ రెడ్డి, మాజీ ఎంపీపీ వీరం ప్రసాదరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ అమినాబీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిడుతూరు(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం మండలంలోని రోళ్లపాడు గ్రామంలో మినీ గోకులాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపీడీవో దశరథరామయ్య, టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, రామ స్వామి రెడ్డి, అయ్యన్న, సర్వోత్తమ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, నాగేంద్రుడు, నరసింహగౌడు , ఏపీవో జయంతి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్(ఆంధ్రజ్యోతి): పశు సంక్షేమానికి ప్రభుత్వం చేయూతనందిస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి అన్నారు. నంద్యాల మండలంలోని కొత్తపల్లి, పెద్దకొట్టాల గ్రామాలలో శనివారం ఎంపీడీవో సుగుణశ్రీ ఆధ్వర్యంలో గోకులాలను ప్రారంభించారు. తులసిరెడ్డి కొత్తపల్లిలో గోకులం షెడ్డును ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రైతు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నారాయణ, వెంకటరమణ, ఏపీవో శ్రీకళ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్(ఆంధ్రజ్యోతి): పిన్నాపురం, పెద్దఅనంతాపురం గ్రామాల్లో గోకులం షెడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహానంది గంగాదేవి, పశుసంవర్ధకశాఖ ఏడీ అరుణ, టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రాజేంద్రారెడ్డి, ఏపీవో నాగమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల పాదయాత్రికులకు మళ్లీ ఆంక్షలు

- టైగర్ కన్జర్వేషన్ ఫండ్ పేరిట డబ్బు వసూళ్లకు ప్రయత్నం
- వెంకటాపురంలో నిరసన వ్యక్తం చేసిన కన్నడ భక్తులు

ఆత్మకూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీశైల పాదయాత్రికులకు అటవీ అధికారులు మళ్లీ ఆంక్షలు విధించారు. టైగర్ కన్జర్వేషన్ ఫండ్ (టీసీఎఫ్) పేరిట రుసుము వసూళ్లు చేయాలని ప్రయత్నించగా విశ్వహిందూ పరిషత్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక రాష్ట్రం నుంచి శనివారం ఉదయం సుమారు 10 బస్సులతో పాటు ఇతర వాహనాల్లో దాదాపు 600 మందికి పైగా భక్తులు వెంకటాపురం నుంచి శ్రీశైలానికి కాలినడకన బయలుదేరారు. అయితే అటవీ మార్గంలోకి ప్రవేశించే క్రమంలో కన్నడ భక్తులను అటవీ అధికారులు అడ్డగించి టైగర్ కన్జర్వేషన్ ఫండ్ (టీసీఎఫ్) ఒక్కొక్కరు రూ.100 చెల్లించి వెళ్లాలని ఆంక్షలు విధించారు. కొంత మంది భక్తులు రూ.100 ఇచ్చి వెళ్లగా మరికొంత మంది ఇలాంటి వసూళ్లు ఎప్పుడు లేవని, తాము చెల్లించలేమని తేల్చిచెప్పారు. ఈక్రమంలోనే వెంకటాపురంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసు కున్న వెంక టాపురం గ్రామస్థు లతో పాటు ఆత్మ కూరుకు చెందిన విశ్వహిందూ పరిషత్ నాయకులు గరుడాద్రి సుదర్శన్, శ్రీధర్‌గుప్తా, ఆవులరెడ్డి అటవీ అధికారులు వసూళ్లు చేస్తున్న ప్రదేశానికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏ జీవో ప్రకారం డబ్బులు వసూళ్లు చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. దీంతో తమశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము డబ్బు వసూళ్లు చేస్తున్నామని అక్కడి అటవీ అధికారులు సమాధానం ఇచ్చారు. అయితే పాదయాత్రికులు డబ్బు చెల్లించే ప్రసక్తే ఉండదని, అవసరమైతే ఇక్కడే నిరసనలు చేస్తామని వారు తెల్చిచెప్పడంతో అటవీ అధికారులు దిగొచ్చారు. ఎలాంటి రుసుము వసూళ్లు చేయకుండానే పాదయాత్రికులకు అడవిలోకి అనుమతించారు.



వసూళ్లపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

ఉత్తమ ముగ్గులకు బహుమతులు

నంద్యాల కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ముగ్గులు వేసిన జిల్లాలోని బ్రాహ్మణ మహిళలకు బహుమతులు అందిస్తామని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి బహుమతి ప్రదానోత్సవానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను ఆహ్వానించినట్లు నిర్వహకులు తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌ద్వారా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు తమ ఇంటివద్దనే ముగ్గులు వేసి వాటిని ఫొటో, వీడియో, ముగ్గువేసిన మహిళ ఆధార్ కార్డుతో సహా 9640463858 నెంబరుకు పంపాలన్నారు. వీరందరికీ నంద్యాల సత్యసాయి కళ్యాణ మండపంలో ఈనెల 19న ఆళ్లగడ్డ టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతులమీదుగా బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని చెప్పారు.

సంక్రాంతి ముందస్తు సంబరాలు

పాణ్యం, జనవరి11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. స్టూడెంట్ అఫైర్ డీన్ డాక్టర్ రామిరెడ్డి, ఈసీఈ హెచ్‌వోడీ సోఫియాప్రియదర్శిని ఆధ్వర్యంలో విద్యార్థులు సంక్రాంతి సంస్కృతి దుస్తులు ధరించి ఎద్దుల బండి ప్రదర్శన నిర్వహించారు. బాలికలు ముగ్గులపోటీలో పాల్గొన్నారు. ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నా ట్య ప్రదర్శనలు నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం తాండవ మల్లేశ్వరుడు

రేపటి నుంచి ఉత్సవాలు

కొత్తపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో వెలసిన పార్వతి సమేత తాండవ మల్లేశ్వరస్వామి మహోత్సవాలు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఆలయ ఈవో కార్తీక్ మాట్లాడుతూ ఈ నెల 13న స్వామివార్లకు బిందె సేవ, గణపతి పూజ, అంకురారోపణ, తాండమలేశ్వరస్వామి పూజలు, 14న అర్ధరాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం, 15న ప్రభోత్సవం, 16న ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ, పారువేట ఉంటుందని వెల్లడించారు. ఈ ఉత్సవాలకు కొత్తపల్లి నుంచే కాకుండా ఇతర ప్రాంతాలకు భక్తులు తరలిరానున్నారు.

ఉత్సవ కమిటీ నియామకం

ఆలయానికి ధర్మకర్తల మండలి లేకపోవడంతో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉత్సవాలకు ఫెస్టివల్ కమిటీని నియమించిందని ఈవో కార్తీక్ తెలిపారు. ఈ కమిటీలో ధర్మకర్తల మండలి చైర్మన్‌గా మీనిగె జయమ్మ, వైస్ చైర్మన్‌గా రామళ్లకోట మల్లికార్జున రెడ్డి, సభ్యులుగా సీతా శివరాములు, సుగాలి దేవిబాయి, గూడెం చిన్నపుల్లయ్య, మద్దుల బ్రహ్మానందరెడ్డి, జనపల వెంకటరమణ, మీనిగ వెంకటరమణలను నియమించినట్లు తెలిపారు.

భక్తుల కొంగుబంగారం మల్లేశ్వరుడు

పార్వతి సమేత తాండవ మల్లేశ్వరస్వామి ఆలయాన్ని సుమారు 5వేల సంవత్సరాల పూర్వం నిలువు బండలతో నిర్మించినట్లు ఇక్కడి చరిత్రకారుల ద్వారా తెలుస్తోంది. ద్వాపర యుగంలో పంచ పాండవులు అరణ్యవాసం చేసే సమయంలో చోళభూపాల మాహారాజు ఈ ప్రాంతంలో మహాదేవుడు తాండవం చేశారని తెలుసుకుని తాండవ మల్లేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఒకప్పుడు రాయలవారి పాలనలో శ్రీశైలంలో ప్రధాన గోపుర నిర్మాణ సమయంలో అక్కడున్న బయలు వీరభద్రాలయంలో తాండవ మల్లేశ్వరస్వామికి చెందిన ఆలయ తాళపత్ర గ్రంథాలు, శాసనాలు ఉండటతో శ్రీకృష్ణదేవరాయలు కూడా పార్వతి సమేత మల్లేశ్వరస్వామిని స్మరించినట్లు తెలిసింది. ఈ ఆలయంలో ఉగ్రరూపం దాల్చిన పరమేశ్వరుడు స్వయంభుగా వెలసినట్లు పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ ఆలయానికి తాండవ మల్లేశ్వరస్వామి ఆలయం అని చరిత్రకెక్కిందని పెద్దలు చెబుతున్నారు. ఈ ఆలయంలోని శివలింగం శ్రీశైలంలోని జ్యోతిర్లింగం పోలి ఉండటం విశేషం. స్వామివారు స్వయంభూగా వెలసడంతో భక్తులకు కొంగుబంగారంగా నిలవడంతో స్వామిని ఒక్కసారి స్మరించుకుంటే సర్వపాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం.



తాండవ మల్లేశ్వరస్వామి ఆలయం

'టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా'

బండిఆత్మకూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా ఉంటుందని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో శనివాం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జగన్మోహన్‌రెడ్డి, రఘుస్వామిరెడ్డి, గోవిందరెడ్డి, మహమ్మద్‌వలి, హేమసుందరరెడ్డి సభ్యత్వ నమోదు చేయించారు.

నంద్యాల రూరల్(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ నగర్‌లో38వ వార్డు ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజారంజక పాలన కొనసాగుతోందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటికొండ మహేష్‌బాబు, ఇమాంహుసేన్, వడ్డె నాగేంద్ర, జాఫర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పగిడ్యాల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పడమర వనములపాడు గ్రామానికి చెందిన భాస్కర్‌నాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డి తెలిపారు. మత్తయ్య అనే వ్యక్తి భాస్కర్ నాయుడు సోదరుడి కోసం ఇంటి వద్దకు వెళ్లాడు. అయితే భాస్కర్‌నాయుడు మత్తయ్యను కులం పేరుతో దూషించడంతో పాటు దాడి చేయడంతో తలకు, కాళ్లకు గాయాలైనట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భాస్కర్‌నాయుడుపైకేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్లాబ్ కూలి వ్యక్తి మృతి

- పాత భవనం కూల్చివేస్తుండగా ప్రమాదం

నంద్యాల క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ప్రియాంకనగర్ మెయిన్‌రోడ్డుపై ఉన్న పాత బిల్డింగ్‌ను శనివారం కూలగొడుతుండగా స్లాబ్ మీద పడడంతో పడి ఒకరు మృతి చెందారు. మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన నాగరాజు(40) అనే వ్యక్తి స్లాబ్ కూల్చడానికి ఇతరులతో కలిసి పనికి వచ్చారు. అయితే కూల్చే సమయంలో స్లాబ్ నాగరాజుపై పడటంతో తప్పించుకోలేక పక్కనే ఉన్న కాలువలో పడిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్లాబ్ శిథిలాలు కాలువపై కూడా పడటంతో నాగరాజు బయటకు రాలేకపోయారు. స్థానికులు ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు. అయితే తీవ్రంగా గాయపడడంతో వెంటనే నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు స్థానికులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మోటార్ సైకిల్‌కు నిప్పు

నంద్యాల క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని రోజాకుంట వీధిలో ఓ మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టిన ఘటన శనివారం చోటుచేసుకుంది. మోటార్ సైకిల్ యజమాని సూర్యారావు ఒక హోటల్ నడుపుకుంటుండేవారు. శనివారం ఇంటివద్ద నిలిపిన తన మోటార్‌సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టారని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి: సీపీఎం

ఆత్మకూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజలపై మోపిన విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కస్టమర్ చార్జీ, డ్యూటీ సర్ చార్జీ, ట్రూ ఆఫ్ చార్జీ తదితర చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం సరికాదని అన్నారు. నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, ఇస్మాయిల్, సద్దాంహుసేన్, జబివుల్లా తదితరులు ఉన్నారు.

పగిడ్యాల(ఆంధ్రజ్యోతి): ప్రజలపై మోపిన ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. పగిడ్యాలలో శనివారం సీపీఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈశ్వరమ్మ, మునిస్వామి, పక్కీరయ్య, మనోహర్‌గౌడ్ పాల్గొన్నారు.

'బాలకృష్ణమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి'



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

నంద్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ వ్యవస్థాపకుడు, మాజీ శాసనమండలి సభ్యుడు మార్పు బాలకృష్ణమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు కోరారు. బాలకృష్ణమ్మ 12వ రాష్ట్ర స్థాయి స్మారక ఉపన్యాస సభ శనివారం నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకుడు సత్యనారాయణ, ఐపీయ చీఫ్ ప్యాట్రన్ సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటానికి ఏపీటీఎఫ్ నాయకులు పూలమాలలువేసి నివాళి అర్పించారు. ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మి, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగల్‌రాయమండడి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్య దర్శి మధుసూదన్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవ స్వామి, శ్రీనివాసులు, వివిధ జిల్లాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి'

పాములపాడు జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 21 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని ఆధారుకార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు జత పరచాలని ఈనెల 16లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి తిరుణాల

పగిడ్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలోని అన్నపూర్ణ, కాశీవిశ్వేశర స్వామి, తూర్పు ప్రాతకోట గ్రామంలోని నాగేశ్వర స్వామి తిరుణాల ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మేటి సేవలు, 13న స్వామి వారు పెళ్లికొడుకు, 14న కల్యాణం, 15న రథోత్సవం, 16న పారువేట, 17న వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలకరించారు. వివిధ రకాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



తూర్పు ప్రాతకోటలో ఉత్సవాలకు సిద్ధంగా నూతన రథం

నూతన రథం సిద్ధం

తూర్పు ప్రాతకోట గ్రామంలో తిరుణాల మహోత్సవాన్ని గ్రామస్థుల సహకారంతో నూతన రథాన్ని సిద్ధం చేసినట్లు ఆలయ నిర్వాహకులు పలుచాని మహేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి తెలిపారు. దేవాలయ ఆవరణలో శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. గ్రామానికి చెందిన చిలకల శంకర్‌రెడ్డి, మోక్షేశ్వరరెడ్డి, రామలింగారెడ్డి, యుగంధరరెడ్డి ఆధ్వర్యంలో నూతన రథం తయారు చేయడానికి గత ఏడాది ఫిబ్రవరిలో దీక్ష తీసుకున్నట్లు తెలిపారు. నూతన రథం తయారు చేసిన సందర్భంగా గ్రామంలో ఈ నెల 13 నుంచి 17 వరకు ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బెస్త అన్నదాన సత్రం అభివృద్ధికి కృషి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 11(ఆంధ్రజ్యోతి) : దిగువ అహోబిలంలోని బెస్త(గంగపుత్రుల) అన్నదాన సత్రం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గొడుగు హరీష్ కుమార్, ఉపాధ్యక్షుడు కొండబోయిన బాలచంద్రుడు తెలిపారు. అహోబిలంలో శనివారం వారు మాట్లాడుతూ దిగువలో బెస్త అన్నదాన సత్రం నిర్మాణ దశలో ఉందన్నారు. రాష్ట్రంలోని బెస్తలు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకువచ్చి తమ వంతు సహకారం అందించి అన్నదాన సత్రం నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలన్నారు. అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 13 నుంచి 15వ తేదీ వరకు దిగువ అహోబిలంలో అన్నదానం చేస్తున్నట్లు వారు తెలిపారు.

చాగలమర్రి వాసికి డాక్టరేట్


ప్రిన్సిపాల్ ఎస్. చిన్నదుర్గన్న

చాగలమర్రి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామానికి చెందిన ప్రిన్సిపాల్ ఎస్.చిన్నదుర్గన్నకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను శనివారం ప్రదానం చేసింది. కడప జిల్లా దువ్వూరు గ్రామంలోని జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రాజనీతిశాస్త్ర విభాగంలో పరిశోధనలు చేసినందుకు డాక్టరేట్‌ను అందుకున్నారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, రాజనీతిశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు ఆనందనాయుడు పర్యవేక్షకులుగా వ్యవహరించగా భారతదేశం-పాకిస్తాన్ సంబంధాలు, ద్వైపాక్షిక శాంతి ప్రక్రియలో ఒక అధ్యయనం అన్న అంశంపై పరిశోధనలు చేశారు. ఇందులో భాగంగా యూనివర్శిటీ వారు ఎస్. చిన్నదుర్గన్నకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కళాశాల అధ్యాపకులు, పీఆర్టీయూ సంఘ నాయకులు అభినందించారు.

వైసీపీ మండల అధ్యక్షుడిగా సోమేష్ యాదవ్



డోన్ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా సోమేష్ యాదవ్ నియమితులయ్యారు. శనివారం సోమేష్ యాదవ్ మాట్లాడుతూ పార్టీ తనకు ఇచ్చిన అవకాశాన్ని మరింత బాధ్యతగా పని చేస్తానని అన్నారు.

ప్యాపిలికి కృష్ణమూర్తి

ప్యాపిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా పోతుదొడ్డి క్రిష్ణమూర్తి నియమితులయ్యారు. రేస్‌లో పలువు నేతలు ఉన్నా క్రిష్ణమూర్తిని అధిష్టానం రెండవసారి నియమించింది. క్రిష్ణమూర్తి ఎంపిక పట్ల పలువురు వైసీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

కొలిమిగుండ్లకు గురివిరెడ్డి



కొలిమిగుండ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ కొలిమిగుండ్ల మండల కన్వీనర్‌గా చింతలాయపల్లె గ్రామానికి చెందిన అంబటి గుర్విరెడ్డి మరోసారి ఎంపికయ్యారు. పార్టీ అధిష్టానం తాజాగా విడుదల చేసిన జాబితాలో మూడోసారి అంబటి గుర్విరెడ్డిని మండల కన్వీనర్‌గా నియమించింది. దీంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, పార్టీ పెద్దలకు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

డోన్ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కృష్ణారెడ్డి (53) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. ఆయన మృతికి రెడ్డి సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీకాంతరెడ్డి, జీవీ కృష్ణారెడ్డి తమ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి ఏపీ సంఘం తరుపున రూ.10వేలు అంత్యక్రియలకు మృతుని కుటుంబానికి అందజేశారు. అలాపే లారీ మోటార్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరాం భౌతికకాయాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి


రామాపురంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

అవుకు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాపురం గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను వడ్డెర సంఘం నాయకుడు పుల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా శనివారం నిర్వహించారు. వడ్డే ఓబన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు నాగరాజు, రామ్‌మోహన్, విశ్వం, రంగస్వామి, సురేష్, బాబు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల కూటమి ప్రభుత్వానికి వడ్డెర సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఓబన్న 218వ జయంతి వేడుకలను కొలిమిగుండ్లలో సంఘం నాయకులు వెంకటయ్య, వెంకటస్వామి, కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, అంజనేయులు, మహేష్ తదితరులు నిర్వహించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్‌పై హత్యాయత్నం?

డోన్ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్‌పై హత్యాయత్నం జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 6వ తేదీ రాత్రి 9.20 గంటల సమయంలో పట్టణంలోని గుత్తిరోడ్డు నుంచి తన నివాసానికి వెళ్తుండగా.. వెనుక నుంచి ఓ కారు వేగంగా వచ్చి బైక్‌పై వెళ్తున్న కోట్రికే హరికిషణ్‌ను సైడు నుంచి ఢీకొనడంతో ఆయన కింద పడి తలకు గాయాలయ్యాయి. ఆయన 7వ తేదీన ఉదయం కోట్రికే హరికిషన్ పట్టణ పోలీసులకు జరిగిన విషయంపై ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పట్టణ పోలీసులు తీసిన సీసీ ఫుటేజీలు శనివారం వైరల్ అయ్యాయి. సీసీ ఫుటేజీలో కారు వేగంగా వచ్చి ఓ సైడు నుంచి ఢీ కొట్టినట్లుగా తెలుస్తుంది. దీంతో సీసీ ఫుటేజీల ద్వారా ఆయనపై హత్యాయత్నం జరిగిందన్న చర్చ పట్టణంలో జరుగుతోంది. కోట్రికే హరికిషణ్ గత ఎన్నికల ముందు వైసీపీ నుంచి వీడి టీడీపీలో చేరారు. ఈ విషయంపై పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా దృష్టికి తీసుకెళ్లగా డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్‌పై హత్యాయత్నం జరిగినట్లు ప్రస్తుతం ఎటువంటి ఆధారాలు లేవన్నారు. సీసీ ఫుటేజీల ద్వారా కారును గుర్తించే పనుల్లో ఉన్నామన్నారు. ఆ కారు గుర్తించిన తర్వాత అన్ని విషయాలు బయటకు వస్తాయని, హత్యాయత్నం జరిగిందనేది ప్రస్తుతం ఊహాగానాలు మాత్రమేనని సీఐ స్పష్టం చేశారు.

ఆర్థిక సాయం

సంజామల, జనవరి 11: గిద్దలూరు గ్రామానికి చెందిన యాగంటి పల్లె సీతమ్మ ఈ నెల 1న అనారోగ్యంతో మృతి చెందింది. ఈమె దశదినకర్మలకు టీడీపీ మండల ఇన్‌చార్జి బత్తుల వెంకట ప్రతాప్ రెడ్డి శనివారం రూ. 5వేలు ఆర్థిక సాయాన్ని మృతురాలి కొడుకు సుబ్బారావుకు అల్లుడు భూషణానికి ఆర్థిక సహాయాన్ని అందజేసి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న బత్తుల వెంకటప్రతాప్‌రెడ్డి

సంక్రాంతి సంప్రదాయాలు వెలుగులెక్కడ?

చాగలమర్రి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సంక్రాంతి వస్తున్నదంటే గ్రామాల్లో పండుగదనం ఉట్టిపడేలా సందడి ఉండేది. క్రమేపి ఆనాటి సంక్రాంతి సంబరాలు కనుమరుగవుతూ వస్తున్నాయి. గంగిరెద్దుల ఆటలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. గాలిపటాల రెపరెపలు కూడా లేవు. ఇక పశు సంపదకు పూజలు అసలే లేవు. బతుకుదెరువు కోసం కొందరు గంగిరెద్దుల వలే ఆవులను సింగారించి వీధుల్లో తిప్పుతూ పొట్ట పోసుకుంటున్నారు. ఇక ఇళ్ల ముందు రంగవల్లులు అక్కడక్కడ తళుక్కున మెరుస్తున్నాయి. పేడతో పెట్టే గొబ్బెమ్మల జాడే లేదు. అంతేకాక హరిదాసుల కీర్తనలతో గ్రామాలు ప్రతిధ్వనించేవి. నేడు వారి రాక కూడా తగ్గింది.

దూరమవుతున్న క్రీడా పోటీలు ● కనుమరుగవుతున్న ఉత్సాహం

మండలంలో గొడిగనూరు, ముత్యాలపాడు, చిన్నబోదనం, మద్దూరు గ్రామాల్లో సంక్రాంతి పండుగకు పారువేట ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆయా గ్రామాల్లో దేవతామూర్తులను పల్లకితో ఊరేగింపు చేస్తూ వివిధ వేషధారణలతో విన్యాసాలు చేస్తారు. అయితే గొర్రెలకు తోకలు కోసి సున్నం పెట్టి వదిలేడయం.. యువకులకు పరుగుపందేలు నిర్వహించడం... పారిపోయిన గొర్రెను పట్టుకొచ్చిన వారికి గ్రామం తరఫున ఆ గొర్రెను బహుమతిగా అందజేయడం లాంటి గతంలో చేసేవారు. ప్రస్తుతం ఇలాంటి కార్యక్రమాలు స్వస్తి పలకడంతో సంక్రాంతి కళ తప్పినట్లయింది. మల్లేవేముల, మద్దూరు గ్రామాల్లో చెన్నకేశవ, సంజీవరాయ, ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులచే పల్లకి ఉత్సవం మాత్రమే నిర్వహిస్తారు. నేలంపాడు, రాంపల్లె, పెద్దబోధనం తదితర గ్రామాల్లో భారీ స్థాయిలో ముగ్గుల పోటీలు, యువతీ యువకులు క్రీడా పోటీలను నిర్వహించే వారు. అయితే ఇప్పుడు ఇలాంటి పోటీలు కనిపించడం లేదు. బెంగుళూరు, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో చదువుకుంటున్న వారు, ఉద్యోగాలు చేసే సాఫ్ట్‌వేర్లు స్వగ్రామాలకు చేరుకొని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేవారు. మరో వైపు వాతావరణ ప్రభావంతో రైతులు కూడా సాగు చేసిన పంటలు దెబ్బతింటుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో పండుగల వైపు అంత ఆసక్తి కనబరచడం లేదు.

● పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ సాఫ్ట్‌వేర్, ఇతర ఉద్యోగులు సంక్రాంతికి కుటుంబ సమేతంగా స్వగ్రామాలకు వస్తుండటంతో సందడిగా ఉండేవి. రానురాను వారు గ్రామాలకు రావడమే మానేశారు. కొన్ని గ్రామాల్లో మాత్రం సంక్రాంతి పండుగను జరుపుకుంటున్నారు.


గంగిరెద్దుల వారి విన్యాసాలు


చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో హరిదాసు వేషధారణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పల్లెల్లో పండుగ సందడి లేదు..



గ్రామాలలో సంక్రాంతి సాంప్రదాయాలు తగ్గి సాంకేతికత వైపు వెళ్తున్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారు. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో పండుగలను ఉత్సాహంగా జరుపుకోలేకపోతున్నాం. గ్రామాల్లో జరిగే ముగ్గుల పోటీలు, కోడి పందెంలు ఆగిపోయాయి. పండుగ వచ్చిందంటే గంగిరెద్దుల, హరిదాసులు కనిపించే వారు. కానీ ఆ రోజులు ఇప్పుడు లేవు.

- శ్రీనివాసరెడ్డి, రైతు, తోడెండ్లపల్లె గ్రామం

గ్రామాల్లో ఆధునికత వైపు దృష్టి



సంక్రాంతి పండుగ వచ్చిందంటే గ్రామంలో సంబరాల సందడిగా ఉండేది. ఇళ్ల ముందు ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు ఉంచి పూజలు చేసి నృత్యాలు చేసేవారు. చిన్నారులకు తలపై రేగుపండ్లు పోసి స్నానాలు చేయించేవారు. కుటుంబ సభ్యులంతా ఆనందం పంచుకునేవారు. ప్రస్తుతం గ్రామాల్లో సందడి కనిపించడం లేదు. పిల్లల చదువుపై దృష్టి సారిస్తున్నారు. ఆధునిక పద్ధతుల వల్ల మార్పులు జరిగాయి.

- రమణారెడ్డి, రైతు, ముత్యాలపాడు గ్రామం

పారువేట ఉత్సవాలకే పరిమితం



గ్రామాల్లో సంక్రాంతి పండుగ రోజు పారువేట ఉత్సవాలకే పరిమితమయ్యాయి. గతంలో కోడి పందెంలు, ఎద్దుల పోటీలు, క్రీడా పోటీలు జరుగుతుండేవి. కాలానుగుణంగా నాటి సాంప్రదాయాలు విస్మరిస్తున్నారు. పంటలు సరిగా పండక, నేటి యువత దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడం, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యత ఇవ్వడంతో సాంప్రదాయ పండుగ కళతప్పుతోంది.

- నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్, శెట్టివీడు గ్రామం

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి బీసీ

బనగానపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేద రైతుల కోసం గోకులం షెడ్ల పథకాన్ని ప్రారంభించామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో రూ.2.30 లక్షలతో నిర్మించి గోకులం షెడ్‌ను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గోకులంషెడ్ల పథకాన్ని పూర్తిగా ఆపివేసిందన్నారు. రాష్ట్రంలోని పేద రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో ఈపథకాన్ని తమ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులందరికీ గోకులాలు మంజూరు చేస్తామన్నారు. రైతులు గోకులాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె మండల మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు పీపీ.కుమార్‌రెడ్డి, తిమ్మాపురం అల్లె శంకర్‌రెడ్డి, అల్లె నాగేశ్వరరెడ్డి, రామతీర్థం మద్దిలేటి, నందివర్గం శేషారెడ్డి, ఉమామహేశ్వరరావు, జిల్లెల్ల సుబ్బారెడ్డి, ఆంజనేయులు, వెంకటయ్య, వెంగన్న, వల్లెపుశంకర్, ఎన్ఆర్ఈజీఎస్ పీడీ జనార్దన్ రావు, ఏపీడీ నరసింహారెడ్డి, ఏపీఓ పాల్గొన్నారు.


తిమ్మాపురంలో గోకులం షెడ్ ప్రారంభిస్తున్న మంత్రి

నీచ రాజకీయాలు చేస్తే సహించేది లేదు

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా టోకెన్‌ల జారీలో జరిగిన తొక్కిసలాటపై వైసీపీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తే సహించేది లేదని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని కోటకందుకూరు గ్రామంలో నిర్మించిన మినీ గోకులంషెడ్డును ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. నియోజకవర్గానికి 120 గోకులం షెడ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 30 షెడ్లు పూర్తయ్యాయని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శీలం హరికుమార్‌రెడ్డి, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, ఆర్ల సుబ్బయ్య, నరసింహుడు, కొండయ్య, చాంద్‌బాషా, లక్ష్మయ్య, ఉసేన్‌వలి పాల్గొన్నారు.

● శిరివెళ్ల గుండంపాడు గ్రామంలో రైతు రామేశ్వరగౌడ్ నిర్మించిన మినీ గోకులం షెడ్డును టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మురళీ, గ్రామ సర్పంచ్ సంగిరెడ్డి మౌనిక, టీడీపీ నాయకులు సారెడ్డి రామనాగిరెడ్డి, అన్నెం విజయభాస్కర్‌రెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పాడి రైతుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు.శనివారం వల్లంపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్‌ను ఎంపీడీవో వరప్రసాదరావు, ఇతర అధికారులతో కలిసి సర్పంచ్ జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. మండలంలోని భీమునిపాడు, రేవనూరు, కలుగొట్ల, కంపమల్ల, వెలగటూరు, కోవెలకుంట్ల తదితర గ్రామాల్లో నిర్మించిన గోకులం షెడ్లను అధికారులు, టీడీపీ నాయకులు ప్రారంభించారు.


కోటకందుకూరులో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమా

ప్యాపిలి: మండలంలో శనివారం గోకుల్ షెడ్ల నిర్మాణాలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. వెంగళాంపల్లి, మెట్టుపల్లి, చంద్రపల్లి, పీఆర్‌పల్లి, నల్లమేకలపల్లి తదితర గ్రామాల్లో షెడ్లను ప్రారంభించారు. మొదటి విడతలో రూ.24లక్షలతో 11 షెడ్లను ప్రారంభించినట్లు అధికారుల తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, వై లక్ష్మీనారాయణయాదవ్, టి శ్రీనివాసులు, ఖాజాపీర్, సుదర్శన్, అంకిరెడ్డి, కోదండ, శంకర్ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో గోకులం షెడ్లను బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కనకాద్రిపల్లె గ్రామ సర్పంచ్ శివశంకర్, ఉపసర్పంచ్ రామలక్ష్మణ, పెద్దిరెడ్డి పాల్గొన్నారు. మరోవైపు బెలుంశింగవరం గ్రామంలో గోకులం షెడ్లను ఉపాధి అధికారులతో కలిసి గ్రామ టీడీపీ నాయకులు శంకరరెడ్డి, కట్టుబడి రామ్మోహన్, వెంకటేశ్వరరెడ్డి, ఎమ్మార్పీస్ క్రిష్ణయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


మద్దూరులో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం


మద్దిలేటి స్వామి క్షేత్రంలో చక్రస్నానం చేయిస్తున్న ఈవో అలయ

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం

చాగలమర్రి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు కిషోర్‌శర్మ, సాయిశర్మ, అభినయశర్మ ఆధ్వర్యంలో దంపతులు ప్రవీన్, సింధూలచే శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులచే కల్యాణం నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, కలశ స్థాపన, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు భరద్వాజ, వంశీధర్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

● చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభిరామ, చెన్నకేశవ ఆలయాల్లో శనివారం వేద పండితుల ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలను శనివారం వైభవంగా నిర్వహించారు. కోదండరామాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు, పల్లకి ఉత్సవం చేశారు.

వాసాపురంలో ప్రత్యేక పూజలు

రుద్రవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాసాపురం వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వెంకటేశ్వరస్వామి, లక్ష్మీగోదాదేవి అమ్మవార్లకు, మానసలింగేశ్వర స్వామి, త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. నరసాపురం, రుద్రవరం, దొర్నిపాడు, గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు ప్రారంభించారు.

వైభవంగా గ్రామోత్సవం

డోన్ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులదొడ్డి గ్రామంలో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవ కార్యక్రమం శనివారం తెల్లవారుజామున వైభవంగా జరిగింది. స్వామివారి విగ్రహాన్ని కొండపై ఉన్న ఆలయం నుంచి తీసుకునివచ్చి ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి ఆవులదొడ్డి గ్రామం లో పురవీధుల గూండా మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆలా మోహన్ రెడ్డి, గ్రామ పెద్దలు, భక్తుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు వైభవంగా జరిగింది.

ముగిసిన ఏకాదశి వేడుకలు

బేతంచెర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు మహాపూర్ణాహుతితో శనివారం ముగిశాయి. ఉదయం 9 గంటల నుంచి చక్రస్నానం, అర్చన, మహాబలి, మహా పూర్ణాహుతి, మహా కుంభ ప్రోక్షణ, ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు అత్యంత ముఖ్య ఘటన చక్రస్నానం ఉదయం 10 గంటల నుంచి మద్దిలేరు వాగు కోనేరులో నిర్వహించారు. విద్యుత్ కాంతుల శోభతో వివిధ అలంకరణలతో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం ఆలయ వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామాంజనేయులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

కొలిమిగుండ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్లలో ప్రభుత్వ మండల ఖాజీ ఖాదర్‌వలి అధ్యక్షతన ముస్లిం, మైనార్టీ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షులుగా తుమ్మలపెంట బాయికాటి హుస్సేన్‌పీరా, ఉపాధ్యక్షులుగా చింతలాయపల్లె హుసేన్‌వలి, ప్రధాన కార్యదర్శిగా సలీంభాషా, జాయింట్ సెక్రటరీగా షేక్ మాబుసుభాన్‌వలి, ట్రెజరర్‌గా హుస్సేన్‌భాషా, గౌవరావధ్యక్షులుగా హాజీవలి, ముఖ్య సలహాదారుగా జాకీర్ హుస్సేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల ఖాజీ ఖాదర్‌వలి తెలిపారు.

14 నుంచి బెలుంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కొలిమిగుండ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గ్రామంలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని 14నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈపోటీలు నిర్వహిస్తున్నామని, మొదటి బహుమతిగా రూ.20వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడా టీములు తమపేర్లను 13లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు.

అగ్నిప్రమాదంలో పశువులు మృతి

రుద్రవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యల్లావత్తుల గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గుడిసె దగ్ధమైందని శనివారం బాధితుడు సహదేవుడు వాపోయాడు. ఈ ప్రమాదంలో రెండు పశువులు మృతి చెందగా మరో ఏడు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. సర్పంచ్ చంద్రమోహన్, గ్రామ పెద్దలు కాలిబూడిదైన గుడిసెను పరిశీలించారు. సుమారు రూ. ఐదు లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్, గ్రామస్తులు కోరారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జనవరి11 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం 2025 నూతన క్యాలెండర్, డైరీలను మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, జిల్లా యూటీఎఫ్ సహాధ్యక్షుడు సత్యప్రకాశ్, మండల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్, వెంకటేశ్వర్లు, సతీష్, కృష్ణయ్య, నాగరాజు, సుధాకర్, సన్నన్న, విజయకుమార్, దస్తగిరి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ చైర్మన్ ఎన్నిక వాయిదా

చాగలమర్రి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి గ్రామంలోని పాల డెయిరీ చైర్మన్ ఎన్నిక వాయిదా వేసినట్లు మేనేజర్ ఈశ్వరయ్య తెలిపారు. ఈనెల 3న చిన్నవంగలి గ్రామంలో జరిగిన పాల డెయిరీ డైరెక్టర్ల ఎన్నిక ఉద్రిక్తంగా మారడంతో శాంతి భద్రతల దృష్ట్యా ఎన్నికలను వాయిదా వేశారు. తిరిగి చాగలమర్రిలోని పాల కేంద్రం వద్ద శనివారం తాత్కాలిక పాల డెయిరీ చైర్మన్ ఎన్నిక కోసం ఇరువర్గాలకు చెందిన పాల డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. అయితే టీడీపీ, వైసీపీ వర్గాలకు చెందిన డైరెక్టర్ల కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు మేనేజర్ పేర్కొన్నారు. తిరిగి ఎన్నికల తేదీ ప్రకటిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు


బహుమతులు అందిస్తున్న బీసీ ఇందిరమ్మ

కోవెలకుంట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్లలోని పాండురంగస్వామి దేవాలయ ఆవరణలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రాష్ట్రమంత్రి బీసీ జనార్దనరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను బీసీ ఇందిరమ్మ ప్రారంభించారు. సుమారు 84 మంది మహిళలు పాల్గొన్నారు. మొదటి బహుమతి మధువర్షిణికు వాషింగ్‌మెషిన్, రెండో బహుమతి మహాలక్ష్మికు కుట్టుమిషన్, మూడో బహుమతి సుకన్యకు ఎయిర్‌కూలర్‌ను బీసీ ఇందిరమ్మ అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, టీడీపీ యువ నాయకులు కాత్రెడ్డి మల్లికార్జునరెడ్డి, గడ్డం అమరనాథరెడ్డి, మురళీ, అభిలాష్, కుళాయి పాల్గొన్నారు.

బేతంచెర్ల: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బేతంచెర్ల పట్టణంలోని స్థానిక అమ్మవారి శాల వెనుక బాగాన ఉన్న షెడ్డులో ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్, వనిత క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు 60 మంది పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మహిళల విభాగంలో మల్లేశ్వరమ్మకు ప్రథమ బహుమతికి డబుల్ కాట్, జయంతికి రెండో బహుమతి సోఫా, రాజేశ్వరమ్మకు మూడవ బహుమతి డ్రెస్సింగ్ టేబుల్‌ను అందజేశారు. కార్యక్రమంలో గుండా గోపాల్, బత్తు సుబ్రహ్మణ్యం, జనార్దన్, విష్ణుమోహన్, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.


బేతంచెర్లలో ముగ్గులు వేస్తున్న మహిళలు